క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: జిల్లాలోని మద్దెలబండ, తాటికుంట, నాగర్‌దొడ్డి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి 5:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్న ట్లు విద్యుత్ ఏడీఈ నీలి గోవిందు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ పట్టణం లోని పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన వద్ద విద్యుత్ స్తంభాలను తొలగించి పక్కకు ఏర్పాటు చేసేందుకు పట్టణంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్ నుంచి వెళ్లే 33 కేవీ మద్దెల బండ ఫీడర్‌లోని విద్యుత్ తీగలను తొలగించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. దాని వల్ల ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు తక్కశిలలో..

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల గ్రామంలో మారమునగాల–2 సబ్ స్టేషన్ నుంచి 11కేవీ ఫీడర్ పరిధిలో పలు విద్యుత్ సమస్యలు వీధి దీపాల మరమ్మతుల కోసం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

ఎన్నికల్లో పోటీకి యువతకు అవకాశం

గట్టు: వచ్చే పంచాయతీ ఎన్నికల్లో యువత పోటీ చేసే విధంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కృషి చేస్తుందని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చదువుకున్న యువత పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే విధంగా తాము చైతన్య వంతం చేయనున్నట్లు తెలిపారు. సామాజిక మార్పుకు తమ వంతు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 255 పంచాయతీల్లో సర్పంచులుగా చదువుకున్న నిరుద్యోగ యువతను పోటీకి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు



అయిజ: ప్రభుత్వ గురుకుల ఇంటర్ కళాశాలలో సీట్లు సాధించిన విద్యార్థులను సామాజిక సేవ యువజన సంఘం సభ్యులు అభినందించారు. మండల కేంద్రంలోని బుడుగ జంగాల కాలనీకి చెందిన వీరమణి జడ్చర్లలోని గురుకుల కళాశాలలో, పూల కర్రెన్న ఇటిక్యాల గురుకుల కళాశాలలో సీట్లు సాధించడంతో వారిని అభినందించారు. ఈ సందర్భంగా సామాజిక సేవ యువజన సంఘం సభ్యులు విద్యార్థుల నివాస గృహాలకు వెళ్లి మిఠాయిలు తినిపించారు. విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని కోరారు.

రోడ్డుపై బోర్‌ను పూడ్చివేయండి

మానవపాడు: మండలంలోని జల్లాపురంలో ఓ వ్యక్తి ప్రభుత్వానికి సంబంధించిన రోడ్డుపై బోర్ వేయించారని, జల్లాపురం గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని, జిల్లా అధికారుల ఆదేశానుసారం గురువారం జల్లాపురం గ్రామం సందర్శించి రోడ్డుపై బోర్ వేసిన వ్యక్తికి నోటీసులు అందించామని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జల్లాపురంలోని వ్యక్తికి బోర్ పూడ్చి వేయమని ఆదేశాలు ఇచ్చామన్నారు. స్పందించిన వ్యక్తి రోడ్డు స్థలం తమది కాదని, బోర్‌ను పూడ్చివేస్తామని తెలిపారు.

రాంపాటి ఆలయంలో పూజలు



రాజోళి: మండల కేంద్రంలోని తుంగభద్ర నది మధ్యలో ఉన్న రాంపాటి శివాలయంలో రాజోళి పీహెచ్‌సీ బృందం గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నది మధ్యలో ఉన్న ఆలయంలో కొలువైన రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు, అర్చనలు చేసిన అనంతరం వారికి అర్చకుడు తీర్థ ప్రసాదాలు అందచేశారు. మండల ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని పూజలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని రాజశ్రీ గార్లపాడుకు చెందిన కుర్వ సుబ్బన్న, హరిజన ఈదన్నలు ఇటీవల మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం ట్రస్టు చైర్మన్ సోమనాద్రి గురువారం రాజశ్రీ గార్లపాడుకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరాజ్‌మీర్జా, నారాయణ, బీచుపల్లి, జాకీర్, పాషా, లక్ష్మన్న, హనుమంతు, మద్దిలేటి పాల్గొన్నారు.

నూతన భవనాల నిర్మాణమెప్పుడో?

- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- కొత్త మండలంలో భవనాల ఊసే లేదు
- అద్దె, పాత భవనాల్లోనే కాలం వెల్లదీత



కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనంలోనే పశుసంవర్ధక శాఖ కార్యాలయం

రాజోళి: నూతన మండలం ఏర్పాటు చేసినా, పరిపాలనకు అనుగుణంగా నూతన భవనాలు నిర్మించలేదు. మండలం ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా, రెండుసార్లు ప్రభుత్వాలు మారినా, నేటి వరకు భవనాల నిర్మాణం చేయలేదు. నూతన భవనాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసి, గత్యంతరం లేక శిథిలమైన భవనాల్లోనే కాలం వెల్లదీస్తున్నారు. నూతన జిల్లాల ఏర్పాటు అనంతరం మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న రాజోళిని మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. కానీ నేటి వరకు సొంత భవనాలు నిర్మించలేదు. చిన్నపాటి భవనాలు నిర్మించినప్పటికీ అవి ప్రయోజనకరంగా ఉడడం లేదు. నిత్యం రద్దీగా ఉండే కార్యాలయాలకు మాత్రం భవనాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

అద్దె భవనాల్లోనే నెట్టుకొస్తున్న వైనం..

మండల కేంద్రంలో ముందుగా గుర్తుకు వచ్చేవి తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం. కానీ రాజోళిలో ఈ రెండు కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. తహసీల్దార్ కార్యాలయం కొన్ని ఏళ్ల కిందట నిర్మించిన ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో నడుస్తుండగా, ఎంపీడీఓ కార్యాలయం మాత్రం ఒక ఇల్లును అద్దెకు తీసుకుని అందులో నడుపుతున్నారు. మహిళా సంఘం కార్యాలయానికి కూడా గతంలో నిర్మించిన డ్వాక్రా భవనంలోనే కొనసాగుతోంది. ఇక వెటర్నరీ భవనం రేపో మాపో కూలేందుకు సిద్ధంగా ఉంది. విష సర్పాలకు నిలయంగా మారినా.. అందులోనే కాలం వెల్లదీస్తున్నారు. మండల కేంద్రం ఏర్పాటయ్యాక కొత్తగా ఎంఆర్‌సీ భవనం నిర్మించి అందులోనే ఉపాధి హామీ శాఖకు సంబంధించిన పనులు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక సహకార సంఘం ఇంకా ఉమ్మడి వడ్డేపల్లి మండల ప్రాతిపదికలోనే ఉండగా, వడ్డేపల్లిలో ఉన్న కార్యాలయానికే రైతులు వెళ్లక తప్పడం లేదు. కాలేజీ కోసం ఎన్నో ఏళ్లుగా ఉద్యమం చేస్తున్నా, దానిపై నేటి వరకు ఎలాంటి చలనం రావడం లేదు. ఎంఈఓ కార్యాలయం కూడా ఉమ్మడిగానే కొనసాగడం, ఒకే అధికారి ఉండటంతో రాజోళిలో ఆ భవనాలకు నిర్మాణం జరగలేదు. వ్యవసాయ శాఖ కార్యాలయానికి కూడా భవనం లేక పాత భవనంలోనే కొనసాగుతోంది.

ప్రజలకు తప్పని ఇబ్బందులు..

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ పనుల నిమిత్తం ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రధాన కార్యాలయాలు కూడా అద్దె భవనాలు కావడంతో సరైన వసతులు లేక ఇక్కట్లు తప్పడం లేదు. ఇళ్ల మధ్యనే కార్యాలయాలు ఉండడంతో వాహనాలు నిలుపేందుకు కూడా సరైన స్థలం లేదు. రైతులకు సంబంధించిన సామగ్రి తీసుకెళ్లడంలో వచ్చే ఇబ్బందులతో అటు అధికారులకు, ఇటు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ప్రభుత్వ కార్యాలయాల కోసం సొంత భవనాలను నిర్మించాలని, మంత్రులకు, ఉన్నతాధికారులకు వినతులు అందించినా, నూతన భవనం నిర్మించలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో వీలైనంత త్వరగా భవనాలు నిర్మించి, మండలాన్ని మరింత అభివృద్ధి చేయాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వాలు మారినా ప్రయోజనం లేదు



రాజోళిని మండల కేంద్రంగా చేశారని ఎంతో సంతోషించాం. దీంతో అభివృద్ధిలో ముందుకు సాగుతుందని అనుకుంటే, ఏళ్లు గడుస్తున్నా, నేటి వరకు ఒక్క భవనం కూడా నిర్మించలేదు. ప్రజలు కార్యాలయాలకు పెద్ద ఎత్తున వస్తుంటారు. వారికి ఇబ్బందులు కలగకుండా నూతన భవనాలు నిర్మిస్తే బాగుటుంది. కొత్త ప్రభుత్వమైనా దీనిపై దృష్టి పెట్టాలి.

– సంజీవరెడ్డి, రాజోళి

వినతులు ఇచ్చాం..



గతంలో మంత్రులకు కొత్త భవనాల ఆవశ్యకతను తెలియజేస్తూ వినతిపత్రాలు అందచేశాం. అప్పట్లో వారు సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయమన్నారు. కానీ ఇంతవరకు నూతన భవనాల నిర్మాణం ముందుకు కదలలేదు. ప్రస్తుతం మంత్రులకు దగ్గరకు వెళ్లి ఈ ప్రక్రియను ముందుకు కదిలించేందుకు కార్యాచరణ తయారుచేశాం. త్వరలోనే నూతన భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తాం.

– మరియమ్మ, ఎంపీపీ, రాజోళి

ఘనంగా గ్రామ దేవతల ఉత్సవాలు

ధరూరు: మండలంలోని నీలహళ్లిలో గురువారం కర్రెమ్మ, సవారమ్మ, మారెమ్మ అవ్వల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని ప్రతిఇళ్లు ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఆడ పడుచులు, బంధువులు చేరుకోవడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఉత్సవాలను గ్రామంలో ఊరంతా ఉత్సవంలా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నీలహళ్లిలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

క్రీడలతోనే యువతకు ఉత్సాహం

ఉండవెల్లి: యువతకు క్రీడలతోనే ఉత్సాహంగా ఉంటారని ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఈదమ్మ ఉత్సవాల సందర్భంగా టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఎస్‌ఐ రిబ్బన్ కట్ చేసి యువతకు సందేశం అందించారు. క్రీడలు ఆడే సమయంలో గొడవలు జరగకుండా, అన్నదమ్ముల వలే క్రీడలు ఆడాలన్నారు. కార్యక్రమంలో దాతలు వెంకటేశ్వర్లు గౌడు, రామ కోటిరెడ్డి, రైతు సంఘం సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీరాములు, రమేష్, యువకులు అజ్మత్, బాషా, హనీఫ్, వర్దరాజులు, కిషోర్‌గౌడు ఉన్నారు.



ఉండవెల్లిలో క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న ఎస్‌ఐ

‘అప్రోచ్ రోడ్డు నిర్మించండి’

అయిజ: మండల కేంద్రంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ మధ్య నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయాలని అఖిల పక్షం కమిటీ నాయకులు కోరారు. గురువారం బ్రిడ్జి వద్ద నిర్మాణ దశలో ఉన్న సైడ్ వాల్స్ పునాది పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం కమిటీ నాయకులు మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా సరే అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో పట్టణ ప్రజలు బ్రిడ్జి దాటలేక పోతున్నారు. డైవర్షన్ రోడ్డు ఇరుకు సందుల్లో ఉండడంతో వాహనాలు వెళ్లేందుకు వీలు కావడంలేదని మండిపడ్డారు. రోజుకు అనేక సార్లు ట్రాఫిక్ జామ్ అవుతుందని, దానివల్ల అత్యవసర వైద్యసేవల కోసం వాహనాల్లో వెళ్లేవారి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని వాపోయారు. అధికారులు, ప్రజా ప్రతినిధిలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. అధికారులు స్పందించకుంటే నిరాహార దీక్షకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్షం కమిటీ నాయకులు జగపతిరెడ్డి, ఆంజనేయులు, వెంకట్రాములు, విజయ భాస్కర్ రెడ్డి, తాహేర్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న అఖిలపక్షం నాయకులు

ధరూర్‌లో కుండపోతగా వర్షం

ధరూరు: మండలంలో గురువారం సాయంత్రం భారీ గాలులతో కుండపోతగా వర్షం కురిసింది. 5 గంటల నుంచి 7గంటల వరకు దాదాపు 2 గంటల పాటు కురిసింది. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని దోర్నాల, మన్నాపురం, గుడ్డెందొడ్డి, పారుచర్ల, మార్లబీడు, నీలహళ్లి, నెట్టెంపాడు, ద్యాగదొడ్డి, బూరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వాన కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉండగా, సాయంత్రం వర్షం కురవడంతో రైతులు, కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగుకు అనుకూలంగా వర్షాలు కురిసినట్లు పేర్కొన్నారు. వారం రోజుల్లో ఇది మూడోసారి వర్షం కురిసింది. ఈ వర్షాలతో వాతావరణం చల్లబడింది.



ధరూరులో కురుస్తున్న వర్షం

పొలం తగాదాలో వ్యక్తిపై దాడి

రాజోళి: పొలం తమకే కౌలుకు వేయాలని వ్యక్తిపై మరో ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్ద ధన్వాడకు చెందిన చలిమెట్ల మహేష్ కర్నూల్ జిల్లా కొణిదెలలో నివాసముంటున్నాడు. ఆయనకు పెద్ద ధన్వాడలో నా లుగు ఎకరాల పొలం ఉంది. ఆ పొలాన్ని తమ కే కౌలుకు వేయాలని, ఆయన చిన్నాన్న చిన్న శేషిరెడ్డి కొన్ని సంవత్సరాలుగా ఒత్తిడి తెస్తున్నా డు. ఈ క్రమంలో ఈ నెల 14న పెద్ద ధన్వాడ గ్రామంలో జరుగుతున్న శుభకార్యంలో పాల్గొని వెళ్తున్న మహేష్‌పై చిన్నాన్న శేషిరెడ్డి, ఆయన కుమారులు వీరేష్, వెంకటరమణలు కర్రతో దాడి చేయగా, తలకు గాయాలయ్యాయి. ఘ టనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం



గట్టులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



కేటీదొడ్డి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన బీఆర్‌ఎస్ నాయకులు

గట్టు: వరికి అదనంగా రూ.500లు అందిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డిలు ఆరోపించారు. కేసీఆర్ పిలుపు మేరకు గురువారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ వరికి అదనంగా రూ.500 ఇస్తామని చెప్పి, ఇప్పటికి వ్వడం లేదన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోని యాసంగిలో రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సరితారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు మోహన్ గౌడు, బీఆర్‌ఎస్ నాయకులు రామునాయుడు, బజారి, వీరేష్, రాజు, కొళాయి భాస్కర్, వెంకటేష్, చిట్టెయ్య, రంగస్వామి, తిమ్మప్ప, వీరభద్రప్ప, మౌలాలి, తిమ్మప్ప పాల్గొన్నారు.

కేటీదొడ్డి: రైతులు పండించిన సన్న, దొడ్డు రకాల వడ్లకు తేడా లేకుండా రూ.500 బోనస్ అందజేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉరుకుందు డిమాండ్ చేశారు. గురువారం రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలోని తహసీల్దార్ షాహిదా బేగంకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న, వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. రైతులకు బ్యాంక్‌లో రూ.2 లక్షల రుణమాఫి చేస్తామని ఇప్పటికీ చేయలేదని, రైతుకు రైతుబంధు పూర్తిస్థాయిలో అందలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో హనుమంతు, కొండన్న, యుగంధర్, తదితరులు ఉన్నారు.

‘సాక్షి’కి కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో ‘ఐదు రోజులు ఉపాధి కూలీ రూ. 25’ పేరుతో గురువారం ‘సాక్షి’ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా అధికారులు గురువారం మండల కేంద్రంలో పర్యటించి దర్యాప్తు చేశారని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఐదు రోజుల పనికి రూ. 25 పడ్డాయని తెలిపారు. దీనిపై చెన్నిపాడుకు చెందిన ఉపాధి కూలి వంశీకి న్యాయం చేస్తామని, మిగితా డబ్బులు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

ధరూరు: మండలంలోని చిన్నపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సవారమ్మ (35)అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకులు బండ్ల రాజశేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



మల్దకల్‌లో స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ సంగీతలక్ష్మి

మల్దకల్: ఫర్టిలైజర్ షాపు యజమానులు రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ సంగీతలక్ష్మి ఫర్టిలైజర్ నిర్వాహకులను హెచ్చరించారు. గురువారం మల్దకల్, విఠలాపురం గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు రైతులకు ఎరువులను విక్రయించిన వెంటనే రశీదులను ఇవ్వాలన్నారు. రెతులు తప్పనిసరిగా షాపు యజమానులతో రశీదులు పొందాలన్నారు. ఫర్టిలైజర్ షాపులలో పాస్ మెషిన్ ద్వారానే మందులు పంపిణీ చేపట్టాలని, స్టాక్ వివరాలను రికార్డులలో పొందుపరచాలన్నారు. అనుమతులు లేని ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయఅధికారి రాజశేఖర్, ఏ ఈఓ ఖాజాపాష, షాపు నిర్వాహకులు కృష్ణారెడ్డి, సందీప్‌రెడ్డి, గోవిందప్ప, లక్ష్మన్, రాముడు పాల్గొన్నారు.

రేపటి నుంచి వీరభద్రుడి ఉత్సవాలు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు వీరభద్ర స్వామి 10వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు గణపతి హోమం, స్వామివారికి దాసంగాల సమర్పణ, నవగ్రహ హోమం, అఖండ భజన కార్యక్రమాలు, ట్రాక్టర్ రివర్స్ గేర్, భజన పోటీలు ఉంటాయన్నారు. రెండో రోజు రుద్రహోమం, బండలాగుడు పోటీలు, సుదర్శన హోమం, నందికోళ్ల సేవా కార్యక్రమాలు కొనసాగుతాయి. మూడో రోజు కుంకుమార్చన, స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం, భద్రకాళీ అమ్మవారికి వడి బియ్యం కార్యక్రమం, పూర్ణాహుతి కార్యక్రమం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. స్వామి వారి ఉత్సవాలకు దాతల సహకారంతో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. బండలాగుడు పోటీలో పాల్గొనే వారు పేర్ల నమోదు చేసుకోవాలన్నారు.



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం, (ఇన్‌సెట్‌లో) స్వామివారి మూల విరాట్

కళాశాల కోసం అధికారులకు వినతి



విద్యాశాఖ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న కళాశాల సాధన సమితి సభ్యులు

రాజోళి: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కాలేజీ సాధన సమితి సభ్యులు మంత్రి జూపల్లి కృష్ణారావు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంకు వేర్వేరుగా వినతి పత్రం అందించారు. గురువారం హైదరాబాద్‌లోని సంబంధిత కార్యాలయంలో వారిని కలిసి, రాజోళి మండలంలో కాలేజీ ఆవశ్యకతను తెలిపారు. కాలేజీ లేకపోవడం వల్ల విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే విద్యను ముగిస్తున్నారన్నారు. పై చదువుల కోసం కాలేజీ ఏర్పాటు చాలా అవసరమని, కాలేజీ లేకపోవడంతో పేద విద్యార్థులు కార్మికులుగా మారుతున్నారన్నారు. కార్యక్రమంలో సాధన సమితి కన్వీనర్ ఈశ్వరయ్య, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్, సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటి చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటిని నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రిజ్వానా తాన్వీర్ తెలిపారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏడీస్ దోమ కాటు వల్ల డెంగీ వస్తుందని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పాతటైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తచెదారాలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తిరుమల్‌రావు, సోని, ఏఎన్‌ఎమ్‌లు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

కోలా‘హలం’

- వారం రోజులుగా చెదురుమదురు వర్షాలు
- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- సాగులో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారుల సూచన



చిన్నంబావి శివారులో సాగుకు పొలం సిద్ధం చేస్తున్న రైతులు

చిన్నంబావి: ఎండలకు బీడు బారిన పొలాలకు తొలకరి చినుకులు ఊపిరి పోశాయి. వారం రోజులుగా మండలంలో చెదురుమదురు వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలం బాట పట్టారు. ఎప్పుడూ రోహిణి కార్తెలో వర్షాలు బాగా కురిసే అవకాశం ఉన్నా.. ఈసారి ముందే వర్షాలు రావడంతో సాగుకు సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కురిసిన వర్షాలకు పొలాలు పదునెక్కడంతో ఎద్దుల నాగళ్లు, ట్రాక్టర్లతో దుక్కులను దున్నుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ఇలాగే కురిస్తే ముందే విత్తనాలు నాటుకునేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు తెలిపారు. గతేడాది నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన గురయ్యారు. ఈ క్రమంలో రెండో పంట వేసేందుకు అవకాశం లేకుండా పోయింది. కానీ ఈ ఏడాది ముందే వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పంటల సాగు అంచనా..

మండలంలో 17గ్రామ పంచాయతీల పరిధిలో 27వేల ఎకరాల్లో పంట సాగు చేస్తారని అధికారుల లెక్కలు చెప్తున్నాయి. మొక్కజొన్న 9వేల ఎకరాలు, ఉల్లి 3వేల ఎకరాలు, వరి 7వేల ఎకరాలు, మిరప 600ఎకరాలు, కందులు 500ఎకరాలు, పత్తి 200ఎకరాల్లో సాగులోకి రానున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

జూరాల చివరి ఆయకట్టులో అయోమయం

జూరాల ప్రాజెక్టు చివరి ఆయకట్టు మండలంలోని పొలాలే ఉండడంతో దాదాపుగా 12వేల ఎకరాల్లో సాగు గందరగోళం ఉంటుంది. ఈ వర్షాలకు విత్తనాలు విత్తుకున్నా.. ఆయకట్టుకు కాల్వల ద్వారా సాగునీరు ఎప్పుడు వస్తాయోనని ఆందోళనలో రైతులు ఉన్నారు. అదేవిధంగా చిన్నమారు లిఫ్టు కింద మరో 9వేల ఎకరాలు ఉండడం, లిఫ్టు మరమ్మతు నేటికీ పూర్తి కాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ముందస్తు వర్షాలతో పాటు సకాలంలో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందితే ఈ సారి పంట దిగుబడి పెరిగే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

సాగుకు సానుకూలం

ఎప్పుడు లేనంతంగా ఈ ఏడాది ఎండలు రావడం, అదే విధంగా ముందుగానే వర్షాలు వస్తుండటంతో పంటల సాగుకు సానుకూలంగా ఉండే అవకాశం ఉంది. దుక్కులు దున్నుకునే సమయంలో, విత్తనాల సేకరణలో రైతులు జాగ్రత్తలు వ్యవహరిస్తే ఈ ఏడాది పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా చూసుకోవాలని.

– దాకేశ్వర్‌గౌడ్, మండల వ్యవసాయాధికారి

సిద్ధం చేస్తున్నాం



గతేడాది వర్షాలు ఆలస్యం కావడంతో పంటల సాగు గతి తప్పింది. దీంతో రెండో పంటను చాల మంది రైతులు సాగు చేయలేదు. కానీ ఈ ఏడాది ముందే వర్షాలు వస్తుండటంతో రైతులు ఇప్పటికే విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. వరి, మొక్కజొన్న విత్తనాలను ఇప్పటికే రైతులకు అందుబాటులో ఉన్నాయి.

– సుధాకర్‌నాయుడు